క్లుప్తంగా

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం



నకరికల్లు: దేచవరం గ్రామంలో జగనన్న సురక్ష క్యాంపు బుధవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నూరుశాతం రాయితీపై కందివిత్తనాల సంచులను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, సర్పంచ్ నామేపల్లి ఆదిలక్ష్మి, ఉపసర్పంచ్ భవనం రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బండారు వాసు తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులపై అవగాహన అవసరం



అమరావతి: ప్రతి రైతు ఇఫ్కో సంస్థ నానో ఎరువులపై అవగాహన కలిగి ఉండాలని ఆ సంస్థ జనరల్ మేనేజర్ జగన్‌మోహనరెడ్డి అన్నారు. బుధవారం మునగోడు పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. మునగోడు పీఏసీఎస్ సీఈవో సాంబశివరావు అధ్యక్షత వహించారు. జగన్ మోహనరెడ్డి మాట్లాడుతూ నానో ఎరువుల వాడకం వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉన్న పోషక పదార్థాలు పంటలకు అందుతాయన్నారు. భూమిలో రసాయనిక సమతుల్యత దెబ్బతినకుండా భూమి జీవంతో ఉంటుందన్నారు. ఈ సదస్సులో ఇఫ్కో రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ టి.శ్రీధరరెడ్డి, జిల్లా మేనేజర్ లోకేష్, అమరావతి జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



బెల్లంకొండ: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండల ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించి, వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహణ కలిగి ఉండాలని, ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. దోమకాటు ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనంతరం సీజనల్ వ్యాధుల భారిన పడకుండా ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 బాల సుందర రావు, ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌కిరణ్, యోగా టీచర్ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

గేదెలకు పోస్టుమార్టం

అచ్చంపేట: మండలంలోని వేల్పూరులో విద్యుత్ షాక్‌కు గురై రెండు పాడి గేదెలు మృతి చెందగా.. వాటికి బుధవారం పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి పోస్టుమార్టం నిర్వహించారు. గ్రామానికి చెందిన రామారావు, వెంకటేశ్వర్లు గేదెలు మంగళవారం మేతకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే చనిపోయాయి. విద్యుత్ శాఖకు, ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు డాక్టర్ స్వాతి తెలిపారు.

నేడు బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి

సత్తెనపల్లి: భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ (బాబుజీ) 37 వ వర్ధంతి కార్యక్రమం పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని పార్టీ పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలక జైపాల్ బుధవారం తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొంటారని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: మద్యానికి బానిసైన వ్యక్తిని కుటుంబ సభ్యులు మందలించటంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుభానినగర్‌కు చెందిన షేక్ యూసుఫ్(25) కార్పెంటర్‌గా పనిచేస్తుంటాడు. గత కొంతకాలంగా పనికి వెళ్లకుండా నిత్యం మద్యం తాగి తిరుగుతుండంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన యూసుఫ్ ఇంటి సమీపంలో గత నెల 30వ తేదీన ఎలుకల పేస్టు తిన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులుప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు యాసిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుపరిపాలనకు నిదర్శనం 'జగనన్న సురక్ష'

సత్తెనపల్లి: పట్టణంలోని 1వ వార్డు సచివాలయ పరిధిలోని 1, 31 వార్డులకు సంబంధించిన జగనన్న సురక్ష క్యాంపు బుధవారం నిర్వహించారు. కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, 31వ వార్డు ఇన్‌చార్జ్ ఆకుల హనుమంతరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 150 దరఖాస్తులగాను 143 అర్జీలను పరిష్కరించి, ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సాంబశివరావు, స్థానిక నాయకులు కాటుమాల డేవిడ్, అనీఫ్, వరికల్లు కోటిలింగం, సుమిత్ర, ఎస్.మాణిక్యాలరావు, మధు, శాతరాజుపల్లి ఆశ్వరరావు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న కమిషనర్ కొలిమి షమ్మి

293 ధృవీకరణ పత్రాల పంపిణీ

అమరావతి: మండల పరిధిలోని మల్లాది గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఎంపీపీ మేకల హనుమంతరావు పాల్గొని, ధృవపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ మాధురి, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీ నరసింహారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా కుల ధృవీకరణ పత్రాలు 151, ఆదాయం 95, ఆధార్ కార్డులు 29, రేషన్‌కార్డులు మార్పులు10 ఆరోగ్యశ్రీకార్డులో మార్పులు 5, మొత్తం 293 ధృవీకరణ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

అచ్చంపేట: ఓర్వకల్లులో బుధవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్ పద్మాదేవి పాల్గొన్నారు. 31 మంది నుంచి సంక్షేమ పథకాలకు అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. వాటిలో 28 మందిని అర్హులుగా గుర్తించి, ధృవీకరణ పత్రాలు ఇచ్చామన్నారు. అంతర్‌పంటగా రైతు భరోసా కేంద్రం ద్వారా ఉచితంగా కందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సర్పంచ్ కొలకలూరి పేరయ్య, మాజీ సర్పంచ్ పూల కిషోర్, పూలవెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, వ్యవసాయ యూనివర్శిటి మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం బృందం ఆధ్వర్యంలో తాడువాయిలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. గ్రామంలో అర్హులైన వారందరికి దాదాపుకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీడీవో చెప్పారు. కేవలం నలుగురు నుంచి మాత్రమే దరఖాస్తులు వచ్చాయని, వాటికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను ఇవ్వడం జరిగిందన్నారు. ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, సర్పంచ్ భూక్యా సీతాభాయ్, మంత్రి యానాయక్ దంపతులు, లిడ్ క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ధృవీకరణ పత్రాలు అందచేస్తున్న ఎంపీపీ మేకల

పాలన మారింది.. ప్రజల జీవితాలు మారాయి

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పీసపాడు(క్రోసూరు): గత ప్రభుత్వంలో ప్రజలు ప్రభుత్వ పథకాలను పొందాలంటే ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుత ప్రభుత్వంలో అన్ని సేవలు ఇంటి వద్దకే అందుతున్నాయని పెదకూరపాడుఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని పీసపాడు గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పీసపాడు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఇంటి పెద్దకు సంక్షేమ లబ్ధిని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలు నవరత్నాలను 99 శాతం నెరవేర్చటం జరిగిందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయం వద్ద 10వ తేదీ వరకు పడిగాపులు కాసేవారని గుర్తుచేశారు. అప్పటికీ పాలనకు.. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఎంత తేడా ఉందో ప్రజలు గుర్తించాలని కోరారు. సర్వే జరిగిన పంచాయతీల్లో ఇక భూముల రిజిస్ట్రేషన్లు కూడా సచివాలయాల్లోనే జరుగుతాయని అన్నారు. పీసపాడు గ్రామంలో రూ.11.30 కోట్లు సంక్షేమ ఫలాలు అందచేసినట్లు చెప్పారు. రూ.4.86 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. ఎంపీడీవో బి.మహేష్, పీసపాడు సర్పంచ్ గొర్రెపాటిరాజు, ఎంపీపీ పి.కోటయ్య, వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ జమీలా గఫూర్, దాసయ్య, రోశయ్య, పీసపాడు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, పొట్లపల్లికాశిరెడ్డి, అల్లు కేశవరెడ్డి, విప్పల రాజశేఖరరెడ్డి, ఉన్నవ తిరుపతిరావు, పెద్దబ్బాయి పాల్గొన్నారు.



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు

ఐసీడీఎస్‌ను పరిరక్షించాలి..

సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి

సత్తెనపల్లి: సమగ్ర శిశు అభివృద్ధి పథకం ఐసీడీఎస్‌ను పరిరక్షించాలని, బడ్జెట్‌లో నిధులు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి డిమాండ్ చేశారు. బుధవారం పుతుంబాక భవన్లో జరిగిన సంఘం జిల్లా విస్తృత సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హజరయ్యారు. అంగన్వాడీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా ఈ నెల 10 , 11వ తేదీల్లో కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ఎస్ అహల్య అధ్యక్షత వహించారు. మల్లేశ్వరి మాట్లాడుతూ ఐసీడీఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించడానికి నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చిందని ఆమె విమర్శించారు. యూనియన్ నిర్వ హించిన అనేక పోరాటాల ఫలితంగా వర్కర్లకు జీతాలు పెంచుతున్నామని ప్రకటన చేసినా ఇంతవరకు అమలు చేయలేదని ఆమె విమర్శించారు. 2017 నుంచి టీఏ బిల్లులు ఇవ్వలేదని, ఏప్రిల్ 25న అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు దేశవ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగులకు 1972 చట్టం ప్రకారం గ్రాడ్యుటీకి అర్హులని తెలియజేసిందన్నారు. కానీ అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయలేదని ఆమె విమర్శించారు. ప్రైవేటీకరణ విధానంలో భాగంగా రకరకాల యాప్‌లు తెచ్చి పని భారం పెంచుతుందన్నారు. సమావేశంలో సత్తెనపల్లి ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్.కె.సుజాత, ఎస్.అహల్య, కోశాధికారిగా ఎన్.జ్యోతిని ఎన్నుకోవడం జరిగింది. సమావేశంలో ఫిరంగిపురం ప్రాజెక్టు కార్యదర్శి ధనలక్ష్మి, అంగన్వాడి వర్కర్స్ అంజలి, జ్యోతి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మల్లేశ్వరి

భావి పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

పెదకూరపాడు: భావిభారత పౌరులను తీర్చిదిద్దేవి ఉపాధ్యాయులేనని క్రోసూరు ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అన్నారు. మండలంలోని 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాలలో 8 సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శాంతి భూలక్ష్మి, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ప్రవర్ధిని, పద్మజ, రామయ్య ఇటీవల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని బుధవారం ఘనంగా సన్మానించారు. వారి స్థానంలో వచ్చిన నూతన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పరిశుద్ధ కుమారి, మాజీ సర్పంచ్ వి.వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరించిన ఈదా సాంబిరెడ్డి

పురందరదాసు కీర్తన సంఘానికి 25ఏళ్లు

సత్తెనపల్లి: టీటీడీ దేవస్థానం వారు 25 సంవత్సరాల క్రితం పురందర దాసు కీర్తన సంఘాన్ని సత్తెనపల్లి వేణుగోపాల స్వామి భజన మండలి అనే పేరుతో ప్రారంభించారు. నాటి నుంచి క్రమం తప్పకుండా పలు భజనలు, కీర్తనలు, భక్తి పాటలు, ప్రసంగాలు నిర్వహించారు. సంఘ అధ్యక్షులుగా వెలుగూరి బేబీ సరోజినీని, సెక్రటరీగా రామ్‌నాట్ రామచంద్రరావు, కోశాధికారిగా ప్రమీల రాణిని నిర్ణయించారు. బుధవారం వారిని ఘనంగా సన్మానించారు. 25 సంవత్సరాల నుంచి ఒక్క సత్తెనపల్లిలోనే కాకుండా వివిధ ప్రాంతాల్లో సత్తెనపల్లి నుంచి మాచర్ల వరకు, ఇటు వినుకొండ, గుంటూరు వరకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. వీరి కార్యక్రమాలు చూసిన తర్వాత వివిధ గ్రామాల్లో కూడా పురందరదాసు కీర్తన సంఘాలను ఏర్పాటు చేసి సేవలందించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు బేబీ సరోజిని మాట్లాడారు. ఈ కీర్తన సంఘంలో ఎలాంటి కుల, మత, లింగ, వయసు సంబంధం లేకుండా అందరూ పాల్గొనే వారన్నారు. మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక స్మృతులు ఏర్పడతాయని, దీని ద్వారా కాశి, రామేశ్వరం, తిరుపతి, తిరువనంతపురం, అహోబిలం, రిషికేష్, మంత్రా లయం, ఛారుదాం, మొదలగు ప్రాంతాల్లో కీర్తన సంఘం ఆధ్వర్యంలో కోలాటాలు, కీర్తన ప్రదర్శనలు జరిపామన్నారు. ఈ కార్యక్రమంలో శారద, విజయలక్ష్మి, సుజాత, భారతి వెంకటలక్ష్మి, అంజలి, వెంకుబాయ్, మహాలక్ష్మి తదితరులు ఉన్నారు.



గురువు రామచంద్రరావును సత్కరిస్తున్న సంఘం బాధ్యులు

ఆదర్శప్రాయుడు గురులింగం మాస్టారు

నాదెండ్ల: సమాజాన్ని నిర్మించటంలో గురువు పాత్ర ఉన్నతమైనదని, ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆదర్శప్రాయుడు గురులింగం మాస్టారని హెచ్‌ఎం ఏవీ సత్యనారాయణ చెప్పారు. గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన అవనిగడ్డ గురులింగం ఇటీవల నరసరావుపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీ వాసులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ప్రస్తుతం హెచ్‌ఎంగా సత్యనారాయణ మాట్లాడుతూ, గురులింగం మాస్టారు 1990లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారని, పలు పాఠశాలల్లో పనిచేసి గణపవరంలో ఎనిమిదేళ్లపాటు సేవలందించారన్నారు. వందల మంది విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పారన్నారు. తనతల్లి దండ్రులైన అవనిగడ్డ యల్లమందయ్య, హుస్సేనమ్మ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి పలు పాఠశాలల్లో విద్యా సామగ్రి పంపిణీ చేశారన్నారు. రావూరి భరద్వాజ విజ్ఞాన పీఠం ప్రధాన కార్యదర్శిగా, జనవిజ్ఞాన వేదిక చిలకలూరిపేట డివిజన్ ట్రెజరర్‌గా విశిష్ట సేవలందించారన్నారు. ఉపాధ్యాయులు మేరీ సుజాత, నాగమల్లేశ్వరి, రమాదేవి, జరుగుల ప్రసాద్, సునీత రత్నకుమారి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాషా, జేవీవీ అధ్యక్షుడు దారా బుచ్చిబాబు, స్థానిక నాయకులు బొంతా బాబు, జ్ఞానయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు గురులింగంను సన్మానిస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు

కదులుతున్న రైలు ఎక్కబోయి వృద్ధుడి దుర్మరణం

వినుకొండ టౌన్: కదులుతున్న రైలు ఎక్కుతు ప్రమాదవశాత్తు వృద్ధుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్ లో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. జి.ఆర్.పి ఎస్ఐ సుబ్బారావు కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా పెద్ద రావిపాడు గ్రామానికి చెందిన తాతపూడి శాంసన్ (60) కదులుతున్న ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలును ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడటంతో, కాళ్లకు బలమైన గాయాలయ్యాయన్నారు. తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలోనున్న శాంసన్‌ను చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గం మధ్యంలో మృతి చెందాడన్నారు.

నేడు 'జగనన్న సురక్ష' క్యాంపులు

రాజుపాలెం: గణపవరం, అంచులవారిపాలెంలో నేడు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ధృవీకరణ పత్రాలు, సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ముప్పాళ్ళ: మండలంలోని గోళ్ళపాడు, లంకెలకూరపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాంపులు గురువారం జరుగుతాయని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ బుధవారం చెప్పారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే క్యాంపులో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, అర్జీలు అందిస్తే అక్కడికక్కడే ధృవీకరణ పత్రాలు అందించటం జరుగుతుందన్నారు.

రేపు క్రోసూరులో 'జగనన్న సురక్ష'

క్రోసూరు: క్రోసూరు-3, 88త్యాళ్లూరు గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో ప్రజలకు పలు రకాల సర్టిఫికెట్లు అందచేస్తారని పేర్కొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వం

అచ్చంపేట: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలోనే సంతృప్తి కలుగుతుందని ఏఈఎల్‌సీ మధ్యమ గుంటూరు సీనెడ్ అధ్యక్షులు ఎస్ జోహాన్‌బాబు తెలిపారు. పెదపాలెంలో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగి, నిరాశ్రయులైన కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించారు. తమ సంస్థ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.6వేల నగదు, 25కిలోల బియ్యం, నిత్యావసరాలు, వంట పాత్రలు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు పలు సేవా సంస్థలు ఆదుకునేందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నార్త్ ప్యారిస్ లూథరన్ చర్చి ట్రెజరర్ చిత్తరంజన్, నాగరాజు, పాస్టర్లు సూర్యప్రకాష్‌రావు, సుందర్ రావు, జైభీమ్ భారత్‌పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు మాతంగి సుధాకర్, జడకమల్ కుమార్, మాలమహానాడు అధ్యక్షుడు ఆశీర్వాదం, కుచిపూడి జాన్‌బాబు, జిల్లెల్ల పాల్‌రాజ్, మాలే పద్మారావు, ప్రసాద్ పాల్గొన్నారు.



బాధితులకు నగదు అందజేస్తున్న సంస్థ సభ్యులు

200 మంది విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

బొల్లాపల్లి: స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని రోటరీ క్లబ్, అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో విద్యా ర్థినులకు 200 సైకిళ్లు బుధవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ అసిస్ట్ గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో సేవా కార్యక్రమా లు చేపట్టడం హర్షణీయమని, గత ప్రభుత్వాల హయాంలో పూర్తికాని పనులను చేపట్టి అభివృద్ధికి నాంది పలికిందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం హయాంలో స్వచ్ఛంద సంస్థలకు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే పని అంతగా లేదని, ప్రభుత్వమే నాడు-నేడులో పాఠశాలల బిల్డింగ్‌లు, అంగన్‌వాడీ కార్యాలయాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ డి.గోవిందు నాయక్, తహసీల్దార్ ఎ.వి.సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా, అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాస్తి రంగారావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆటపాటలతో విద్య

బొల్లాపల్లి: మండలంలోని మేళ్ళవాగు హబ్ అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల తల్లులకు పోషకాహారం బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త ఎం. సరోజినీ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. ఇందులో భాగంగా చిన్నారులకు ఆటపాటలతో విద్యను నేర్పడం జరుగుతుందని తెలిపారు. పీపీ-1, పీపీ-2 బోధన ఉంటుందని, చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణను సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

కౌలు రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి

రాజుపాలెం: కొత్తగా కౌలు రైతు కార్డులు తీసుకున్న రైతులు వారి గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఆన్‌లైన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి వీరయ్య బుధవారం తెలిపారు. ఆర్బీకేలోని అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను కలసి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

చాగంటివారిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బుధవారం జరిగింది. వైద్యులు జయకృష్ణ పాల్గొని, 216 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 12 మందికి సాధారణ, 100 మందికి బీపీ, 84 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించారు. పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. అనారోగ్యంతో మంచానికి పరిమితమైన వారి వద్దకు వెళ్ళి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో డీఈఓ కె.రవితేజ, ఎమ్ఎల్‌హెచ్‌పీ పీ.ప్రవల్య, ఏఎన్ఎంలు వెంకటరత్నం, నూర్జహాన్, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): ద్విచక్రవాహనాన్ని మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటన ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం ఇరుకుపాలెం గ్రామ సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన కర్ర శివనాగేశ్వరరావు మరో ఇద్దరితో కలిసి ద్విచక్రవాహనంపై సత్తెనపల్లి నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్నాడు. ఇరుకుపాలెం గ్రామ సమీపంలో అదే దారిలో అంగలూరి శ్రీను తన ద్విచక్రవాహనంపై వస్తూ వెనుకగా వారిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో శివనాగేశ్వరరావు కాలు విరిగిపోయింది. ఆయనను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నట్లు ఏఎస్సై ఇమామ్ తెలిపారు.

వృద్ధుడికి పింఛను నగదు అందజేత

ఊటుకూరు(క్రోసూరు): ఊటుకూరు గ్రామానికి చెందిన జెర్రిపోతు మనోహరం ఏడాది క్రితం పక్షవాతానికి గురయ్యాడు. పెదకాకానిలోని తన కుమార్తె వద్ద ఉంటున్నాడు. 5న పింఛన్ల పంపిణీకి ఆఖరు తేదీ కావటంతో.. అనారోగ్యంతో మనోహరం సొంత గ్రామానికి చేరుకోలేని పరిస్థితిలో ఉన్నారు. వలంటీర్ జెర్రిపోతు రవికిరణ్ పెదకాకానిలోని అతని నివాసానికి వెళ్లి బుధవారం పింఛను నగదు అందజేశారు.

నేడు దొడ్లేరులో గడప గడపకు మన ప్రభుత్వం

క్రోసూరు: దొడ్లేరు గ్రామంలో గురువారం, శుక్రవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వ్యక్తిగత కార్యదర్శిదర్శి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దొడ్లేరు సచివాలయం -1 పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాల లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చలో హైదరాబాద్

పెదకూరపాడు: ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకు ఈ నెల 8న నరసరావుపేటలో జరిగే చలో హైదరాబాద్ సన్నాహక సభకు పెద్ద ఎత్తున మాదిగ సోదరులు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జాన్‌బాబు, వి.జీవన్ పిలుపునిచ్చారు. బుధవారం సన్నాహక సభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణను సాధించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బంక బాబూరావు పాల్గొన్నారు.

నేడు సత్తెనపల్లిలో 'జగనన్న సురక్ష'

సత్తెనపల్లి: పట్టణంలోని 4, 28 వార్డులకు సంబంధించిన జగనన్న సురక్ష శిబిరం గురువారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి, కంటెపూడి గ్రామాల్లో శిబిరం జరుగుతుందని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ పేర్కొన్నారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పిడుగురాళ్ళ బ్రాంచ్ వారి 20.06.2023 ప్రకటనకు సంబంధించి, షేక్ ... పెద్ద సైదా గారి కుమారుడు షేక్ జానీబాషా ఆస్తి తనఖా ప్రకటనలో షెడ్యూల్ ఆస్తికి సంబంధించిన డి.నెం. 10821/2022గా తప్పుగా ప్రచురితమైనది. దానికి బదులుగా 1082/2022 గా చదువుకొనగలరు.
లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు
గుంటూరు.సెల్: 9090595227, 9848052914

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పిడుగురాళ్ళ బ్రాంచ్ వారి 21.06.2023 ప్రకటనకు సంబంధించి, ... ఆస్తి 398.8 చ.గ॥ ప్రచురించబడలేదు. కావున ఈ ప్రకటనలో షెడ్యూల్ ఆస్తి 398.8 చ.గ॥ చదువుకొనగలరు.
లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు
గుంటూరు.సెల్: 9090595227, 9848052914

